

ఉద్యాన యూనివర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ హఠాన్మరణం

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ కె.వెంకట రమణ మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు తీవ్రమైన గుండెపోటు రావడంతో హుటాహుటిన తాడేపల్లిగూడెం ఆస్పత్రికి తరలించినప్పటికీ మార్గమధ్యంలోనే మృతి చెందారని వైద్యులు తెలిపారని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సౌమ్యుడు, మృదుస్వభావి అయిన వెంకట రమణ హఠాన్మరణం విశ్వవిద్యాలయం ఉద్యోగులందరినీ దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ప్రస్తుతం ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులుగా, పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్టడీస్ ఇన్‌ఛార్జి డీన్‌గా ఆయన పని చేస్తున్నారు. వెంకటరమణకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్, రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు రమణ భౌతికకాయానికి నివాళులు అర్పించారు. అనంతరం స్వస్థలానికి భౌతికకాయాన్ని తరలించారు. అనంతరం సంతాప సభ నిర్వహించారు.

సైబర్ టెర్రర్..!



సైబర్ నేరాలు ప్రజలందరినీ తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఆర్థిక నష్టంతోపాటు మానసికంగా తీవ్ర ఆందోళన, ఆవేదనకు కారణమవుతున్నాయి. ప్రభుత్వం ఎన్ని హెచ్చరికలు చేసినా.. మాయమాటలతో విద్యావంతులను సైతం సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించేస్తున్నారంటే అతిశయోక్తి కాదు.

నిత్యావసర వస్తువుగా స్మార్ట్‌ఫోన్

దాని ఆధారంగానే రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

రోజుకో రీతిన సైబర్ మోసం

ఏలూరు నగరంలోని మూడో పట్టణ పరిధిలో సత్రంపాడు ప్రాంతానికి చెందిన మహిళ ఓ కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేస్తోంది. ఆమెకు ఓ వీడియో కాల్ వచ్చింది. అటువైపు ఉన్న వ్యక్తి పోలీస్ యూనిఫామ్ ధరించి 'మీ పేరుపై ఒక పార్శిల్ వచ్చింది, ఆ పార్సిల్‌లో సంఘ విద్రోహ కార్యకలాపాలకు పాల్పడే వస్తువులు లభించాయి. వెంటనే పోలీస్ స్టేషనుకు రావాలి' అని బెదిరించారు. అలా రాలేమంటే తమ ఖాతాకు నగదు జమ చేయాలని ఘీంకరించారు. దీంతో భయాందోళనకు గురైన ఆమె దఫదఫాలుగా సుమారు రూ.11 లక్షలు వారి ఖాతాలోకి జమ చేసింది. చివరికి అనుమానం వచ్చి, తాను మోసపోయాయనని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఏలూరులోని ఓ రిటైర్డ్ ఉద్యోగి సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి మొదట ఆన్‌లైన్ ట్రేడింగ్ ద్వారా కొంత సొమ్మును ఇన్వెస్ట్ చేశాడు. తర్వాత ఆ సొమ్ము రెట్టింపయ్యాయని ఫోన్‌కు మెసేజీ వచ్చింది. ఆ సొమ్ము పొందాలంటే కొంత సొమ్ము చెల్లించాలని ఆగంతకులు తెలిపారు. దీంతో అతను వారు కోరిన సొమ్ము జమ చేశాడు. అయినప్పటికీ టెక్నికల్ ఎర్రర్ వల్ల ఖాతాలో సొమ్ము జమ కాలేదని, మొత్తం సొమ్ము తిరిగి పొందాలంటే కచ్చితంగా మరికొంత సొమ్ము చెల్లించాల్సిందేనని వారు తెలిపారు. అలా దఫదఫాలుగా అతను రూ.తొమ్మిది లక్షలు చెల్లించాడు. ఆపై వారి ఫోన్లు పని చేయకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించాడు.

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఇటువంటి ఘటనలు పలు రూపాల్లో జరుగుతుండటం, రోజురోజుకీ సరికొత్త రూపాల్లో సాగుతుండటం అందరినీ ఆందోళనకు గురి చేస్తోంది. వాటిలో మొదటి రకం ఆన్‌లైన్ ట్రేడింగ్ ఇన్వెస్టుమెంట్, ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ ద్వారా సొమ్ము చెల్లిస్తే గంటల వ్యవధిలో వాటికి వడ్డీతో సహా పెద్దమొత్తంలో సొమ్ము జమవుతుందని నమ్మబలుకుతాడు. మొదట ఇన్వెస్ట్ చేసిన అనంతరం మన సొమ్ముకు కొంత సొమ్ము అదనంగా కలిపి మన ఖాతాలో జమ చేస్తారు. దీంతో ఇది నమ్మిన మనం తిరిగి మళ్లీ ఆ ఖాతాలో సొమ్ము ఇన్వెస్ట్ చేస్తాం. డబ్బులు ఒకసారిగా పెరిగి ఖాతాలో జమ కావడంతో పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేస్తారు. అయితే ఈసారి అవి మన ఖాతాలో జమ కావు. అవి జమ కావాలంటే తిరిగి మళ్లీ కొంత సొమ్ము చెల్లించాలని అడుగుతారు. మనం సొమ్ము జమ చేసినా మన ఖాతాలోకి రావు. ఇలా ఎంతోమంది లక్షలాది రూపాయలను పోగొట్టుకున్న వారు ఉన్నారు.

సైబర్ అరెస్ట్ ఫ్రాడ్. ఈ క్రమంలో ఒక వీడియో కాల్‌లో యూనిఫామ్ ధరించిన పోలీసు అధికారులు మనకు ఫోన్ చేస్తారు. అతను మన పేరు మీద అనధికార వస్తువులు ఎయిర్‌పోర్ట్‌లో, లేదా పార్శిల్‌లో గుర్తించామని, అరెస్ట్ చేసేందుకు సిద్ధం చేశామని, వెంటనే పోలీస్ స్టేషనుకు రావాలని గంభీరంగా మాట్లాడతారు. బాధితులు తమకేమీ సంబంధం లేదన్నా వినకుండా డబ్బు పంపితే ఈ విషయాన్ని సెటిల్ చేస్తామని చెబుతారు. అది నమ్మిన బాధితుడు దఫదఫాలుగా రూ.లక్షల్లో వారి ఖాతాకు జమ చేస్తాడు. ఇంతకీ అతనిపై ఏ నేరం, ఏ కేసు ఉండదు.

సైబర్ న్యూడ్ వీడియో కాల్స్ ఫ్రాడ్

ఈ తరహా నేరాల్లో మొదట ఓ గుర్తు తెలియని మహిళ బాధితుడికి ఫోన్ చేస్తుంది. ఆమె ఫోన్ చేసిన సమయంలో ఆమె ఒంటిపై దుస్తులు ఉండవు. ఆమె బాధితుడిని రకరకాల మాటలతో మభ్యపెట్టి అతను కూడా వస్త్రాలు తీసేయాలని చెబుతుంది. బాధితుడు బట్టలు తీశాడో అంతే ఈ వీడియో మొత్తాన్ని సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ స్క్రీన్ రికార్డింగ్ చేస్తారు. వాటిని తిరిగి బాధితుడికి పంపి డబ్బులు డిమాండ్ చేస్తారు. ఒకసారి చెల్లిస్తే వారు మళ్లీ మళ్లీ చెల్లించాలని బాధితుడిని పలు రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తూనే ఉంటారు.


కొన్ని రకాలైన ఆన్‌లైన్ మోసాలు ఇలానే సాగుతున్నాయి. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లోను ఆఫర్లు ఉన్నాయని, స్పిన్ తిప్పితే 70 నుంచి 80 శాతం ఆఫర్లు వస్తాయని నమ్మబలికేలా ప్రచారం చేస్తారు. ఆ లింకును ఓపెన్ చేస్తే ఆఫర్ లభిస్తుందని నమ్మిస్తారు. ఆ లింకును ఓపెన్ చేయగానే మన ఫోన్ మొత్తం సైబర్ నేరగాళ్ల కంట్రోల్‌లోకి వెళ్లిపోతుంది. ఆపై మన బ్యాంకు ఖాతాలో ఉన్న సొమ్మును వారు తమ ఖాతాలకు మళ్లించుకుంటారు.

అప్రమత్తతే కీలకం..

జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్



సైబర్ నేరాల వలలో పడకుండా ఉండాలంటే అప్రమత్తతే కీలకమని జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఎవరైనా సైబర్ నేరానికి గురైనట్లు గుర్తించిన వెంటనే సైబర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేదా 1930 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. తద్వారా సైబర్ పోలీసులు ఆ ఖాతాను ఫ్రీజ్ చేస్తారని, అనంతరం న్యాయస్థానాల సమక్షంలో ఆ సొమ్మును తిరిగి బాధితుల ఖాతాకు జమ అయ్యేలా చర్యలు చేపడతారని తెలిపారు. ప్రజలు ఆఫర్లు ఉన్నాయంటే నమ్మొద్దని, అలాగే డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని చెప్పినా నమ్మొద్దని సూచించారు. వీడియో కాల్స్ ద్వారా ఎవరైనా తాము పోలీసులమని, లాయర్లమని, ఎయిర్‌పోర్ట్ అధికారులమని, ఆర్మీ అధికారులమని వీడియో కాల్స్ చేస్తే వెంటనే స్థానిక సైబర్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



ప్రమాణస్వీకార సభలో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు

డిసిసిబి ఛైర్మన్‌గా గన్ని ప్రమాణస్వీకారం

తరలొచ్చిన ప్రముఖులు

ప్రతిరైతుకూ మేలు చేయడమే లక్ష్యం


గన్ని వీరాంజనేయులు



బాధ్యతలు స్వీకరిస్తున్న గన్ని వీరాంజనేయులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డిసిసిబి) ఛైర్మన్‌గా గన్ని వీరాంజనేయులు ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక డిసిసిబి ఆవరణలో బుధవారం సాయంత్రం బ్యాంకు సిఇఒ పి.సింహాచలం గన్ని వీరాంజనేయులు చేత ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గన్నిని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఎంఎల్‌ఎలు బడేటి రాధాకృష్ణయ్య, సొంగా రోషన్‌కుమార్, పత్సమట్ల ధర్మరాజు, ఆరిమిల్లి రాధాకృష్ణ, పితాని సత్యనారాయణ, మద్దిపాటి వెంకటరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కార్పొరేషన్ ఛైర్మన్ మంతెన రామరాజు, ఏలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, మాజీ మంత్రి మరడాని రంగారావు, మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళీ, డిసిసిబి మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు, పలువురు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రతి రైతుకూ మేలు జరిగేలా రేయింబవళ్లు కృషి చేస్తానన్నారు. ఏలూరు డిసిసిబి ఛైర్మన్ గా ఏలూరు జిల్లాలోని రైతాంగానికి, అదేవిధంగా ఆప్కాబ్ ఛైర్మన్‌గా రాష్ట్రంలోని రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. తన సమర్థతను గుర్తించి ఏలూరు డిసిసిబి ఛైర్మన్‌గా, ఆప్కాబ్ ఛైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, కూటమి నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అధికారుల సహకారంతో ఏలూరు డిసిసిబిని లాభాల బాటలోకి తీసుకొస్తానని గన్ని వీరాంజనేయులు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖాధికారి ఎ.శ్రీనివాస్, డిసిసిబి జనరల్ మేనేజర్ మాధురి, ఎజిఎం శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, కూటమి నేతలు, ప్రముఖులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకార సభలో మాట్లాడుతున్న చాగంటి మురళీకృష్ణ

డిసిఎంఎస్ ఛైర్మన్‌గా చాగంటి ప్రమాణస్వీకారం

తరలొచ్చిన ప్రజాప్రతినిధులు - పూర్వవైభవం తీసుకొస్తా: చాగంటి మురళీకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

డిసిఎంఎస్ ఛైర్మన్‌గా చాగంటి మురళీకృష్ణ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. స్థానిక డిసిఎంఎస్ గ్రాండ్ కన్వెన్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో మురళీకృష్ణ ప్రమాణస్వీకారం అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ, ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు, ఎపి కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కష్టపడిన వారికి పదవులు దక్కుతాయనడానికి నిదర్శనం పశ్చిమగోదావరి జిల్లా అని అన్నారు. మరో 10 సంవత్సరాలు కష్టపడితేనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలుస్తుందన్నారు. ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని, దానికి ప్రజలు సహకరించాలని కోరారు. రాష్ట్రంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డిసిఎంఎస్‌ను మొదటి స్థానంలో నిలిపేలా నూతన ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ కృషి చేయాలని సూచించారు.

రైతు సంక్షేమానికి కృషి చేస్తా

డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ

రైతులకు అందుబాటులో ఉంటూ, వారి సంక్షేమానికి కృషి చేస్తానని డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ తెలిపారు. తన ప్రజాసేవను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనకు డిసిఎంఎస్ ఛైర్మన్‌గా అవకాశం ఇచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేస్తానన్నారు. డిసిఎంఎస్‌కు పూర్వవైభవం తీసుకొస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్, డిసిఎంఎస్ అధికారులు, ఉద్యోగులు, రైతులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రమోషన్ల అంశంలో అధికారుల తీరుపై ఎఎన్‌ఎంల ఆగ్రహం


కౌన్సెలింగ్‌కు పిలిచి వాయిదా వేయడంపై నిరసన

ఏలూరు డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద ధర్నా

ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ ఆధ్వర్యాన చర్చలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రమోషన్ల విషయంలో ఉన్నతాధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఎఎన్‌ఎంలు స్థానిక డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద బుధ వారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఎఎన్‌ఎంలు మాట్లాడుతూ గత సంవత్సర కాలం నుంచి తమకు ప్రమోషన్లు ఇస్తామని చెప్పి ఎప్పటికప్పుడు నెట్టుకొస్తున్నారన్నారు. సంవత్సరకాలం గా ప్రమోషన్లు లేక జీతం కూడా చాలావరకు నష్టపోతున్నామని వాపోయారు. నిన్నటి వరకు కూడా కౌన్సిలింగ్ జరుగుతుందో లేదో అని సందిగ్ధంలో ఉంచారని, రాత్రికి రాత్రి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, ఉదయం తొమ్మిది గంటలకల్లా డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో హాజరు కావాలని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. సుదూర ప్రాంతాల నుంచి ఉదయమే వచ్చేశామని, అయినప్పటికీ కౌన్సెలింగ్ ప్రారంభించకుండా మధ్యాహ్నం వరకు కూర్చోబెట్టారని వాపోయారు. అనంతరం భోజనాలు చేసి రమ్మని మధ్యాహ్నం నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారని తెలిపారు. ఇప్పుడు మళ్లీ ఈ నెల 22, 23 తేదీల్లో కౌన్సెలింగ్ అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరకాలంగా ఇలానే మభ్యపెడుతున్నారని విమర్శించారు. 276 మంది ఎఎన్‌ఎంల జీవితాలతో ఆడుకోవద్దని, అన్ని జిల్లాలతో సమానంగా ఇక్కడా కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎపి హెల్త్ సెక్రటరీల యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీలక్ష్మి, జిల్లా గౌరవాధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్ నాయకత్వం వహించారు. ఎఎన్‌ఎంలకు సర్దిచెప్పడానికి డిఎంహెచ్‌ఒ, కార్యాలయ అధికారులు ప్రయత్నించినా ఫలించలేదు. ఈ విషయం తెలిసిన ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ అక్కడకు చేరుకుని నేతలతో చర్చించారు. బుధవారం రాత్రి వరకూ చర్చలు సాగుతూనే ఉన్నాయి.



డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద బైఠాయించిన ఎఎన్‌ఎంలు

మెగా డిఎస్‌సి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఐదు కేంద్రాల్లో పరీక్షలు

హాజరు కానున్న 16,634 మంది అభ్యర్థులు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఈ నెల ఆరో తేదీ నుంచి జరగనున్న మెగా డిఎస్‌సి పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో మెగా డిఎస్‌సి పరీక్షలపై జిల్లా ఆమె సంబంధిత అధికారులు, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీతో కలిసి బుధవారం సమీక్షించారు. పాల్గొన్నారు. ఆరో తేదీ నుండి 30 వరకు 23 రోజులుపాటు ఐదు సెంటర్లలో కంప్యూటర్ బేస్డ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఈ పరీక్షలకు 16,634 మంది హాజరుకానున్నారన్నారు. భీమవరం డిఎన్‌ఆర్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, దంతులూరి నారాయణరాజు కాలేజీ, తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజినీరింగ్ కాలేజీ, శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్, నరసాపురంలో స్వర్ణాంధ్ర కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, సెంటర్ల యాజమాన్యంతో మాట్లాడి జనరేటర్‌లను కూడా ఏర్పాటు చేయించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఏ విధమైన లోటుపాట్లనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. హాల్‌టిక్కెట్‌తోపాటు ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, ఏదో ఒక ఫోటో ఐడెంటిటీ కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు.

తప్పులు సరిదిద్దుకునే అవకాశం

డిఎస్‌సి హాల్‌టిక్కెట్‌లో ఏమైనా తప్పులు నమోదై ఉంటే సరిదిద్దుకునే అవకాశం ఉందని, వాటికోసం అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ సూచించారు. ఏదైతే తప్పు నమోదయ్యిందో, దానికి సంబంధించిన ఒరిజనల్ సర్టిఫికెట్‌ను చూపించి, ధ్రువీకరించిన దాని జెరాక్స్ కాపీని అందజేసి, పరీక్షా కేంద్రం వద్దే సరిచేసుకోవచ్చునని చెప్పారు. తప్పులు సరిచేయించుకొనేవారు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, డిఇఒ ఇ.నారాయణ, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ ఎన్.సత్యనారాయణ, విద్యుత్ శాఖ ఎస్‌ఇ ఎ.రఘునాథ్‌బాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందించాలి

సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం

సిపిఎం ఆధ్వర్యాన మోటర్ సైకిల్ ర్యాలీ ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నోఏళ్లుగా టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని, తక్షణం టిడ్కో ఇళ్లు అందించాలని, ప్రభుత్వ లేఅవుట్‌లో ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పట్టాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన మోటార్ సైకిల్ ర్యాలీని మెంటేవారి తోటలోని సిపిఎం జిల్లా కార్యాలయం వద్ద బుధవారం సీతారాం జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. గత 15 ఏళ్లుగా సిపిఎం అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలని అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. ఫలితంగా టిడ్కో ఇళ్లు, జగనన్న ఇళ్ల నిర్మాణం చేపట్టారన్నారు. పాలకులు మారుతున్నా కట్టిన ఇళ్లను పేదలకు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 82 ఎకరాల్లో 8300 ఇళ్లు నిర్మిస్తే కేవలం రెండు వేలు మాత్రమే లబ్ధిదారులకు అందించారని తెలిపారు. సుమారు 6,300 మందికి ఇళ్లను స్వాధీనం చేయలేదన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడుతూ టిడ్కో ఇళ్లపూర్తి చేసి లబ్ధిదారులకు ఇస్తామని చంద్రబాబు చెప్పి ఏడాది అవుతున్నా అమలు చేయలేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10వ తేదీన ఆర్‌డిఒ కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ధర్నాలో లబ్ధిదారులు భారీ సంఖ్యలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, డి.నాగు ఆదినారాయణ, సింహాచలం పాల్గొన్నారు.



జెండా ఊపి మోటార్ సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న సీతారాం



డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

విద్యా వ్యాపారాన్ని అడ్డుకోండి

డిఇఒకు ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి - భీమవరం

కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణను ఎస్‌ఎఫ్‌ఐ నేతలు కోరారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఎస్‌ఎఫ్‌ఐ నేతలు డిఇఒకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో విద్యాహక్కు చట్టాన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు తుంగలో తొక్కుతున్నాయన్నారు. విద్యాహక్కు చట్ట ప్రకారం ప్రభుత్వం ముద్రించిన పుస్తకాల ద్వారా మాత్రమే చదువు చెప్పాలని నిబంధన ఉన్నా పాఠశాలలు సొంతంగా పుస్తకాలు ముద్రించి వేలకు వేలు వసూలు చేస్తున్నాయన్నారు. అన్ని పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నియంత్రణ చట్టం తెలియచేసేలా అన్ని పాఠశాలలో నోటీసు బోర్డు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖ అధికారులను పేరెంట్స్ కాంటాక్ట్ అయ్యేలా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని కోరారు. కొన్ని ప్రాంతాల్లో ఎంఇఒలు కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీపై చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నేతలు ఎస్.లక్ష్మణ్, కె.గోవింద్, ఎన్.సాయి ఫణికుమార్, కె.రోహిత్, పి.సాయికృష్ణ పాల్గొన్నారు.

సరుకుల పంపిణీలో ఇబ్బంది పెడితే చర్యలు

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

రేషన్ షాప్ డీలర్ల ద్వారా సరుకుల పంపిణీలో కార్డుదారులకు ఇబ్బందులు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిత్యావసర సరుకుల పంపిణీ, రీసర్వే పురోగతి, కౌలురైతు కార్డుల నమోదు అంశాలపై సంబంధిత అధికారులతో ఆయన గూగుల్‌మీట్ ద్వారా సమీక్షించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున అన్ని రేషన్ షాపుల దగ్గర టెంట్లు, తాగునీరు, కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేయాలని సూచించారు. గణపవరం మండలం ముప్పర్తిపాడు, ఇరగవరం మండలం పొదలాడ, వీరవాసరం మండలం మెంటేపూడి, యలమంచిలి మండలం పెనుమద్రు గ్రామాలకు సంబంధించిన సర్వే పూర్తిచేసి 30 నోటిఫికేషన్ పూర్తి చేయటం జరిగిందన్నారు. మిగిలిన 16 గ్రామాల్లో వారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో భూమి సాగు చేస్తున్న కౌలురైతుకి భూయజమాని సిఫార్సుతో కౌలు కార్డు ఇప్పించాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో డిఎస్‌ఒ సరోజ, ఎఎస్‌ఒ ఎం.రవిశంకర్, డివిజనల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి కె.శ్రీనివాస్, కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సిహెచ్.రవికుమార్, డిటి ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలి

జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ప్రసాదరావు

భీమవరం: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించి మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు చింతపల్లి ప్రసాదరావు అన్నారు. స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జెవివి జిల్లా ఉపాధ్యక్షులు తలాడి వెంకటేశ్వరరావుచే విద్యార్థులకు సైన్స్ మ్యాజిక్‌షో, మూఢనమ్మకాల మీద అవగాహనా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మంత్రతంత్రాల వెనుక ఉన్న సైన్స్ సూత్రాలను విద్యార్థులకు వివరించారు. కూల్‌డ్రింక్స్ వద్దు కొబ్బరి బొండాం ముద్దు, ప్లాస్టిక్‌భూతాన్ని తరిమికొట్టాలని విద్యార్థులు నినదించారు. అనంతరం బాలబాలికలకు స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, ఐద్వా నాయకురాలు ఎమ్‌డి.సరోజ, గ్రంథాలయ సిబ్బంది వి.సోమరాజు, డ్యాన్స్‌మాస్టర్ జి.శ్యామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాపులు ఏకతాటిపైకి రావాలి

ప్రజాశక్తి - ఆకివీడు

కాపులంతా సంఘటితంగా ఉండి ఏకతాటిపైకి రావాలని వైసిపి మండల అధ్యక్షులు, కాపు సంఘం నాయకులు నంద్యాల సీతారామయ్య పిలుపునిచ్చారు. నాడు ముద్రగడ పద్మనాభం అరుణాచల్ ఎక్స్‌ప్రెస్ దహనం చేశారన్న కేసును కోర్టు కొట్టేసిన ప్రభుత్వం తిరిగి ఆ కేసును రీ ఓపెన్ చేయాలని భావించడం కాపులపై కక్షపూరితమే అన్నారు. అయితే వెంటనే ఆలోచనలు మార్చుకుని కేసు రీఓపెన్ చేయడం అనే జిఒను ఉపసంహరించుకోవడం కూడా యాదృచ్ఛికం కాదన్నారు. కాపు నాయకులైన పవన్ కళ్యాణ్ తెలియకుండానే అన్ని వ్యవహారాలు ప్రభుత్వంలో జరుగుతున్నాయని అనిపిస్తోందన్నారు. అందరూ సమైక్యతతో ఉంటే ఉపముఖ్యమంత్రికి అన్నీ తెలిసి జరిగే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. సమావేశంలో కుంకట్ల దాలయ్య నాయుడు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు : తహశీల్దార్

ప్రజాశక్తి - ఆచంట

అక్రమంగా పంట భూముల్లోని మట్టిని తవ్వితే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ జి.కనకరాజు హెచ్చరించారు. వల్లూరు, పెనుమంచిలి గ్రామాల్లో అక్రమంగా తరలిస్తున్న మట్టి ట్రాక్టర్లను అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడారు. ఖనిజ అభివృద్ధి సంస్థ నుంచి అనుమతులు పొందితే తప్ప మండలంలో ఎవరికీ ఎటువంటి అనుమతులూ ఇవ్వలేదని, అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జయలలిత పాల్గొన్నారు.


పెనుమంచిలిలో మట్టి ట్రాక్టర్లు సీజ్‌చేసిన అధికారులు


స్టాక్‌ను పరిశీలిస్తున్న ఎంఇఒ ప్రభాకర్, సిబ్బంది

తొలి రోజే పాఠ్య పుస్తకాలిస్తాం

ఎంఇఒ - 2 జాన్ ప్రభాకర్

ప్రజాశక్తి - నరసాపురం

పాఠశాలలు తెరిచిన తొలిరోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు, బ్యాగులు ఉచితంగా అందిస్తామని ఎంఇఒ -2 జాన్ ప్రభాకర్ అన్నారు. బుధవారం జిల్లా నుంచి వచ్చిన నోట్ పుస్తకాలు, బ్యాగులను పట్టణంలోని మిషన్ హైస్కూల్లో భద్రపర్చారు. ఇప్పటికే వచ్చిన ఉపాధ్యాయులకు విద్యార్థుల సంఖ్య వారీగా పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. వచ్చిన 64,228 నోట్ పుస్తకాలు, 8806 బ్యాగులను ఎంఇఒ పరిశీలించారు. సిబ్బందిని స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండో విడతలో మరిన్ని నోట్ పుస్తకాలు, బ్యాగులు వస్తాయన్నారు. అనంతరం ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలకు సమాచారం అందించారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా నోట్ పుస్తకాలు, బ్యాగులు సరఫరా చేస్తామన్నారు. ఎటువంటి గందరగోళం లేకుండా ముందుగానే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు మండలాలకు చేరవేస్తున్నట్లు వెల్లడించారు. ఎంఇఒ వెంట సిఆర్‌పిలు శ్రీను, తాతయ్య, మణి, వసుంధర, ప్రియాంక, అన్నపూర్ణ, నేతాజీ, శ్రీనివాస్, ఆనంద్, రవీంద్ర ఉన్నారు.



డిటి సంధ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

రోడ్డు నిర్మించాలని నిరసన

ప్రజాశక్తి - మొగల్తూరు

జిల్లా కేంద్రం భీమవరానికి వెళ్లే రహదారి పనులు వెంటనే చేపట్టి పూర్తిచేయాలని సిపిఎం మండల నాయకులు యడ్ల చిట్టిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మొగల్తూరులోని రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భీమవరానికి వ్యక్తిగత పనులు, ఉపాధి నిమిత్తం వేల మంది వెళ్తున్నారన్నారు. రహదారి అధ్వానంగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి అధ్వానంగా తయారై సంవత్సరాలు గడుస్తున్నా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం చాలా దారుణమన్నారు. రహదారి నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ సంధ్యకు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వేల పాండు రంగారావు, కొత్తపల్లి నాగరాజు, కొల్లాటి బాబూరావు, చిలకపాటి నాగేశ్వరరావు, చల్ల శ్రీనివాసు, కడలి ఏడుకొండలు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న నేతలు

ఆస్తి పన్ను పెంపు ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - పాలకొల్లు

మున్సిపాలిటీలో ఆస్తి పన్ను పెంచాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ కోరారు. ఆస్తి పన్ను పెంపును వ్యతిరేకంగా పట్టణంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది అయిందని, తాము సంపద పెంచి ప్రజలకు పంచుతామని అధికారంలోకి రాకముందు చెప్పారని గుర్తు చేశారు. అయితే ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మున్సిపాలిటీల్లో పన్ను పెంచిందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు పెట్టి విద్యుత్ అదనపు ధరలను వసూలు చేస్తోందని విమర్శించారు. ర్యాలీలో సిపిఎం మండల కార్యదర్శులు జవ్వాది శ్రీనివాస్, కానేటి బాలరాజు, నేతలు బాలిరెడ్డి ఖాన్లు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుమారు 8 లక్షల యోగా రిజిస్ట్రేషన్లు : జెసి

భీమవరం : జిల్లాలో సుమారు 8 లక్షల యోగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. ఇప్పటివరకూ 1400 యోగా ప్రాంగణాలు రిజిస్ట్రేషన్ పూర్తి చేశామని, 5 వేల ప్రాంగణాల రిజిస్ట్రేషన్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో యోగా ఆంధ్ర నిర్వహణపై జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఇఒలతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. మండల స్థాయిలో నిర్వహిస్తున్న యోగా పోటీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. యోగా పోటీల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతి 70 మందికి ఒక ట్రైనర్ చొప్పున జిల్లాలో 5,800 మంది ట్రైనర్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి మండలంలోనూ నిర్వహించే యోగా ఆటల పోటీల సంబంధించిన ఫోటోలు, వీడియోలను వెబ్ సైట్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు.

జోరుగా మట్టి తరలింపు..!

ధ్వంసమవుతున్న రోడ్లు - పట్టించుకోని అధికారులు - ప్రజల అవస్థలు


పంట పొలంలో మట్టి తీస్తున్న వైనం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం మండలం, పట్టణ పరిధిలో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. పచ్చటి పంట పొలాలను రియల్ ఎస్టేట్ పేరుతో పూడ్చేస్తున్న మట్టి మాఫియాను రెవెన్యూ అధికారులు పట్టించుకోని పరిస్థితి. పరోక్షంగా మట్టి మాఫియాకు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో రహదారులు అధ్వానంగా తయారవ్వడంతో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా రహదారులు మెరుగుపరుస్తామని చెప్పింది. అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారులు పునర్నిర్మించారు. వాటాలు అధికారులకు రావడానికి రహదారులు కూడా కారణమని అటు నాయకులు ఇటు రాజకీయ విశ్లేషకులు బలంగా నమ్ముతున్నారు. అటువంటి రోడ్లు వేసినా నేడు రోడ్లపై మట్టే దర్శనమిస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడ్ వేసుకుంటూ రాత్రీ పగలూ తేడా లేకుండా పెద్ద ఎత్తున లారీలు, ట్రాక్టర్లపై మట్టి తరలించడంతో అవి రోడ్లపై పడి రోడ్లు ధ్వంసం అవుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఇటీవల రెండు, మూడు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మట్టిపూడికలు జరుగుతున్నాయి. ఇక్కడ ఎలా రహదారులను అధికారులు పట్టించుకోకపోవడం మట్టి మాఫియాకు వరంగా మారింది. మండలంలోని పట్టణంతో కలిసి ఉన్న గ్రామంలోకి అడుగుపెడితే ఒక ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తుంది. గ్రామంలోని నాయకుల చొరవతో ఎటు చూసినా సీసీ రోడ్లు దర్శనమిస్తాయి. అయితే కొవ్వాడ, అన్నవరం గ్రామ రహదారులు చూస్తే అక్కడ మట్టి మాఫియా చేసే అరాచకం కళ్లకు కనిపిస్తుంది. కోట్ల రూపాయలు ఖర్చు చేసి చక్కటి సీసీ ఉందంటే మట్టి తీసే దగ్గరకే వచ్చి లారీ ట్యాంకుల్లో డీజిల్ నింపుతున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా వర్షాలు పడే సమయంలో మట్టి గడ్డలు పాకురు కట్టి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, అయినా అధికారులు పట్టించుకోవట్లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా గ్రామ రెవెన్యూ అధికారి కనీసం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి ఈ మట్టి మాఫియాను అరికట్టాలని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీనిపై విఆర్ఒకు పలుమార్లు ఫోన్ చేసినా ఆయన స్పందించని పరిస్థితి. ప్రభుత్వ అధికారి ఈ విధంగా వ్యవహరించడం ఆయన నిర్లక్ష్యాన్ని సాక్ష్యం అని పలువురు విమర్శిస్తున్నారు.


సీసీ రోడ్డుపై పడిన మట్టి

హామీల అమల్లో కూటమి ప్రభుత్వం విఫలం

'వెన్నుపోటు దినం' సందర్భంగా వైసిపి నేతల ర్యాలీలు, వినతులు

ప్రజాశక్తి - ఆచంట

ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసిపి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు విమర్శించారు. బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమానికి పోడూరు మండలం తూర్పుపాలెం వైసిపి కార్యాలయం వద్దకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అక్కడ నుంచి మోటార్ సైకిల్ ర్యాలీగా ఆచంట కచేరీ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహశీల్దార్ కనకరాజుకు రంగనాథరాజు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వాసు, జెడ్‌పిటిసి గుంటూరు పెద్దిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.బాబూరావు, నేతలు కర్రి వేణుబాబు, సుంకర సీతారామ్, కోట సరోజినీ వెంకటేశ్వరరావు, జక్కంశెట్టి చంట పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : కూటమి ప్రభుత్వం ప్రజల్ని నమ్మించి మోసగించిందని వైసిపి శ్రేణులు తాడేపల్లిగూడెంలో మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రామారావు పేటలోని కొట్టు సత్యనారాయణ నివాసం నుంచి రామారావు పేట మీదుగా ఆర్‌డిఒ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసగించిందన్నారు. అనంతరం ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ భానుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు పాలకూరి ధర్మరాజు, మాజీ ఎఎంసి ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


ఆచంట: ర్యాలీ చేస్తున్న వైసిపి నేతలు


తాడేపల్లిగూడెం :ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ భానుకు వినతిపత్రం అందజేస్తున్న సత్యనారాయణ


ఉండి : కూటమి ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని వైసిపి జిల్లా పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, పార్లమెంట్ ఇన్‌ఛార్జి గూడూరి ఉమాబాల, క్షత్రియ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా స్థానిక బస్సు స్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ వైసిపి శ్రేణులు ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కావడి నాగార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, నాయకులు జి.సుబ్బారావు, రణస్థుల మహంకాళి, గులిపల్లి అచ్చారావు పాల్గొన్నారు.

పెనుమంట్ర : బూటకపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలను ఎంతగానో ఇబ్బందులు పెట్టిందని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథ రాజు అన్నారు. మార్టేరు సెంటర్లో వెన్నుపోటు దినం బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పెనుమంట్ర, పెనుగొండ, పోడూరు, ఆచంట మండలాలకు చెందిన వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొగల్తూరు : వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరు ప్రసాదరాజు ఆధ్వర్యంలో నరసాపురంలో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి అభిమానులు భారీగా తరలి వెళ్లారు. ప్రత్యేక వాహనాల్లో భారీ ప్రదర్శనతో వెళ్లారు.

పాలకొల్లు : 'వెన్నుపోటు దినం' కార్యక్రమం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి కార్యాలయం నుంచి చేపట్టిన నిరసన ర్యాలీ తహశీల్దార్ కార్యాలయం వరకూ సాగింది. అనంతరం వైసిపి నేతలు తహశీల్దార్ యడ్ల దుర్గా కిషోర్‌కు వినతి పత్రం సమర్పించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి, యడ్ల తాతాజీ, గుణ్ణం నాగబాబు, చిలువూరి కుమార్ దత్తాత్రేయ వర్మ, నడపన గోవిందరాజులు, చెల్లెం ఆనంద ప్రకాష్, కోరాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నరసాపురం: కూటమి ఎన్నికల ముందు ప్రజలకు అసత్య హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు విమర్శించారు. వెన్నుపోటు దినంలో బాగంగా పార్టీ కార్యాలయం నుంచి పట్టణ వీధుల గుండా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ భారీ ర్యాలీ సాగింది. అక్కడ కొద్ది సేపు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం కార్యాలయ ఎఒ పెద్దిరాజుకు వినతిపత్రం అందించారు. ముదునూరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఎం.సోని, చాగంటి సత్యనారాయణ, షేక్ బుల్లిమస్తాన్, జాన్ కేనడీ, కామన బుజ్జీ పాల్గొన్నారు.


తణుకులో మాట్లాడుతున్న కారుమూరి

తణుకు: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీ చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి నరేంద్ర సెంటర్ మీదుగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడారు. చంద్రబాబునాయుడు ప్రజలకు ఏమైనా చేశావా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి'

ప్రజాశక్తి - గణపవరం

రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పని చేస్తోంది కూటమి ప్రభుత్వమని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా బుధవారం అర్ధవరం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. అరాచక పాలన అంతమొంది ఏడాది పూర్తయ్యిందని, కూటమి ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందిస్తోందని తెలిపారు. అనంతరం మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. గ్రామాల కార్య దర్శులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ఉండి:గత వైసిపి దుర్మార్గ పాలనకు స్వస్తి పలికి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి నేటికి సంవత్సరం పూర్తి కావడంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు బుధవారం నియోజకవర్గంలో 'పీడ విరగడైన దినం' కార్యక్రమంలో భాగంగా రంగవల్లులు, బాణాసంచా కాల్పులతో పండగ వాతావరణంలో తమ ఆనందాన్ని వెలిబుచుకుంటున్నట్లు జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు తెలిపారు. మహదేవపట్నంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ కూటమి అధికారం చేపట్టగానే ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ పెంచిందన్నారు. సూపర్ సిక్స్ హామీలను త్వరితగతిన ప్రజలకు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు.సర్పంచి వణిమా నాగవెంకట సుబ్బలక్ష్మి శ్రీనివాస్, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నరసాపురం: వెన్ను పోటు గురించి ప్రసాదరాజు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని మాజీ మంత్రి, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా రుస్తుంబాదలో గోగులమ్మ ఆలయం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 100 మంది పాల్గొన్నారు. విజేతలకు కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్ఎ జానకీరామ్ బహుమతులు అందజేశారు. కొత్తపల్లి సుబ్బారాయుడు విలేకర్లతో మాట్లాడుతూ ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పినా వైసిపికి ఇంకా కనువిప్పు కలగలేదన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి అభ్యర్థికి అత్యధిక మెజార్టీతో అధికారం కట్టబెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి బాబులు, గ్రంది శ్రీమ, యాదంరెడ్డి మహేష్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం:జగననే రావణాసురుడిని రాష్ట్రం నుంచి తరిమికొట్టిన రోజు అని, ప్రజలందరూ దీపావళి టపాసులతో సంబరాలు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. రూ.161.75 కోట్లతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. సొంత తల్లిని చెల్లిని వెన్నుపోటు పొడవడంతో పాటు ఎన్నికల ముందు సొంత బాబాయిని హత్య చేయించిన కేసు ఇంకా నడుస్తూనే ఉందన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 150 కిలోమీటర్ల మేర రూ.19 కోట్లతో రహదారులపై గుంతలన పూడ్చామన్నారు. మాధవరం - అప్పారావుపేట, అప్పారావుపేట - జగన్నాథపురం, అప్పారావుపేట - వీరంపాలెం రహదారులను నిర్మించామన్నారు. పడమర విప్పర్రు రహదారిని పూర్తిచేశామని తెలిపారు. జగన్‌పై 23 కేసులు ఉన్నాయని, మరెన్ని కేసులు వస్తాయో తెలియదన్నారు. పి4లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు అందరినీ భాగస్వాములను చేస్తున్నామన్నారు. వైసిపి పాలనలో 3500 ట్రాక్టర్లను రైతాంగానికి ఇచ్చారని, కూటమి ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై డ్రోన్లను అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిందితుడు మీరా వలీ పరిస్థితి విషమం

ప్రజాశక్తి - ఆకివీడు

ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచార ఘటనలో నిందితునిగా ఉన్న షేక్ మీరా వలీ సాహెబ్ పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. అత్యాచారానికి గురైన బాలిక మేనమామ కిషోర్ మీరా మెడపై బ్లేడ్‌తో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డ అతనిని పోలీసులు ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో బుధవారం భీమవరంలోని ఓ ఆసుపత్రికి తరలించినట్లు సిఐ జగదీశ్వర్ తెలిపారు. ప్రస్తుతం మీరా ఐసియులో ఉన్నాడని, పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు.

ప్రతిఒక్కరూ యోగా చేయాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పరిపూర్ణ ఆరోగ్యానికి యోగా ఒక్కటే సాధనమని డిఎన్‌ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.శివాజీరాజు, సంస్కార భారతి కార్యదర్శి చెరుకువాడ రంగసాయి అన్నారు. భీమవరం డిఎన్‌ఆర్ జూనియర్ కళాశాలలో సంస్కార భారతి ఆధ్వర్యంలో బుధవారం యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెల రోజుల పాటు యోగాపై శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21న భీమవరంలో జరిగే యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఎన్‌సిసి మేజర్ ఎ.వీరయ్య మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో పి.అమూల్య రావు, వీర్రాజు, యువప్రియ, ఉషారాణి, కె.భారత్‌కుమార్, వై.సత్యనారాయణ, ప్రశాంతి, అనురాధ పాల్గొన్నారు.

కొనసాగిన వేసవి విజ్ఞాన తరగుతులు

ప్రజాశక్తి - నరసాపురం

ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం చదవడం నాకిష్టం గ్రంథాలయానికి రండి పుస్తకాలు చదవండి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. పిల్లలందరూ చాలా సంతోషంగా పాల్గొన్నారు. పుస్తక పఠనం కథలు చెప్పడం, యోగా, డాన్స్ క్లాసులు నిర్వహించారు. శాస్త్రవేత్త సుబ్బారావు గిల్లి శ్రీనివాస్, సూర్యంబాబు, జీవన్, విక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు. విజ్ఞాన తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ, విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు ఈ నెల 5వ తేదీన జరిగే ముగింపు సభలో అందిస్తామన్నారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ఎంతో వినోదాత్మకంగా జరుగుతున్నాయని గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి విద్యార్థులకు అక్బర్ బీర్బల్ కథలోని మూడు బొమ్మల రహస్యం, విజ్ఞానవంతమైన కథలు వినిపించారు. గరికపాటి బాపయ్య శర్మ విద్యార్థులకు తల్లిదండ్రులు దైవమని, విద్య నేర్పిన గురువులను జీవితంలో ఎన్నడూ మరిచిపోకూడదని తెలిపారు. గ్రంథాలయాధికారి మాట్లాడారు. ఈ కార్యక్రమాలలో అనేక విజ్ఞాన కథాంశాలు, క్విజ్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెనుమంట్ర : మార్టేరు శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిబిరంలో విశ్రాంత టీచర్ పి.సువర్ణగౌరి పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్, ఇంగ్లీష్ నాలెడ్జ్ సంబంధించిన బుక్స్ చదివించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ బి.చాణిక్య, క్విజ్ పోటీలు నిర్వహించారు. కె.భవ్య, బి.సింధు, ఎన్.అనూష పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పారదర్శకంగా రీసర్వే చేయాలి

ఆర్‌డిఒ దాసిరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

రీసర్వే పనులు పారదర్శంగా నిర్వహించాలని సిబ్బందికి ఆర్‌డిఒ దాసిరాజు సూచించారు. కెపి పాలెంలో నిర్వహిస్తున్న రీ సర్వే పనులను బుధవారం ఆయన సందర్శించారు. రీ సర్వే సమయంలో భూ యజమానులకు ముందుగా సమాచారం అందించి సర్వే చేయాలన్నారు. అనంతరం పేరుపాలెం బీచ్‌లో ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించే యోగా నిర్వహించే ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపిడిఒ సిహెచ్ త్రిశూలపాణి, ఇఒపిఆర్‌డి మేడిది నవీన్ కిరణ్, సిబ్బంది ఉన్నారు.

సిపిఎం నేత సత్యవతి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - ఆకివీడు

సిపిఎం నాయకురాలు బొక్కా సత్యవతి అందించిన ఉద్యమ సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. మహిళా ఉద్యమ నేత, సిపిఎం నాయకురాలు బొక్కా సత్యవతి 4వ వర్ధంతి సభ స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం జరిగింది. ఆమె భర్త బి.సత్యనారాయణ, ఆకివీడు ఏరియా కమిటీ కార్యదర్శి కె.తవిటి నాయుడు తదితరులు సత్యవతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తవిటి నాయుడు మాట్లాడుతూ ప్రజా, మహిళా ఉద్యమాల్లో సుపరిచితురాలైన సత్యవతి ప్రజల మన్ననలను పొందారన్నారు. ప్రజా సమస్యలపై ఉద్యమించిన ఆదర్శ మహిళ అని కొనియాడారు. ఆమె జీవితం ఆదర్శనీయమన్నారు. ఆమె ఆశయ సాధనకు మనమంతా నిబద్ధులమవ్వాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్‌కె.వలీ, పెంకి అప్పారావు, డోకల లక్ష్మి, డి.రవితేజ, బివి.వర్మ, జి.ధనుష్, ఎస్‌కె.బాజీ, బి.సుబ్బారావు, జి.అచ్చాయమ్మ పాల్గొన్నారు.


సత్యవతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అధిక దిగుబడి ఇచ్చే వంగడాలు ఎంచుకోండి

ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త నాగేంద్రబాబు

ప్రజాశక్తి - ఆకివీడు

రానున్న సార్వాలో రైతులు తక్కువ కాలంలో అధిక దిగుబడి సాధించేలా వరి వంగడాలను ఎంచుకోవాలని జిల్లా సాంకేతిక పరిజ్ఞానం ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త నాగేంద్రబాబు సూచించారు. చెరుకుమిల్లి రైతు భరోసా కేంద్రంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి నందమూరి ప్రకాశం అధ్యక్షత వహించారు. నాగేంద్రబాబు మాట్లాడుతూ ఇటీవల ఈ ప్రాంతంలో రైతులు సార్వాలో ఎంటియు 1318 వంగడాన్ని ఎక్కువగా వినియోగిస్తున్నారన్నారు. ఈ వంగడం 150 నుంచి 155 రోజుల వరకూ పంట ఉంటుందన్నారు. ఎంటియు 1275 రకం వంగడాన్ని వినియోగించినట్లయితే 140 రోజుల్లోనే కోతకు వస్తుందని, దిగుబడి కూడా అధికంగా ఉంటుందని సూచించారు. రైతులు తక్కువ మందులతో ఎక్కువ ఉత్పత్తులు సాధించడానికి కృషి చేయాలన్నారు. కెవికె ప్రిన్సిపల్ సైంటిస్ట్ దేబోరా మెస్సీయానా మాట్లాడుతూ ప్రణాళికా బద్ధంగా రైతులు ముందస్తు సార్వా సాగుకు సిద్ధం కావాలన్నారు. మండల వ్యవసాయ అధికారి ఎంఆర్‌పి ప్రియాంక మాట్లాడుతూ రైతులందరూ భూసార పరీక్షలు చేయించుకుని, నేల సారాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అర్జున్‌రాజు, నగేష్ రాజు, వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.